# ఎలగందల్ టైమ్స్

కరీంనగర్ | పెద్దపల్లి

రాజన్న సిరిసిల్ల | జగిత్యాల


ప్రతి అక్షరం.. ప్రజల కోసం..

సంపుటి : 1

సంచిక : 281


14 Jun 2021

బీజేపీలో చేరిక



2024



- బీజేపీలో ఇమడలేక సతమతం...
- బీఆర్ఎస్ స్థాయి కరువైందని ఆవేదన..
- కలకలం రేపుతున్న తాజా వ్యాఖ్యలు....

మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమనేత ఈటెల రాజేందర్ రాజకీయ పయనమెటు... ఆయన బీజేపీలో కొనసాగుతారా... ప్రత్యామ్నాయ మార్గాలపై అన్వేషణ చేస్తున్నారా.. ఓటమి ఎరుగని నేతగా ముద్ర పడిన ఈటెల తొలిసారిగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం ఒకవైపైతే ... బీజేపీలో ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం మరో వైపు ఆయనను బాధిస్తోంది. ఈ నేపథ్యంలో ఒక యూ ట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)

2

# ఈటల దారెటు?

## బీజేపీ, బీఆర్ఎస్ ను మట్టికరిపిస్తా..

- కరీంనగర్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం...
- ఎంపీ టికెట్టుకు వెలిచాల దరఖాస్తు...

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్) వివరాలు 2 లో



## టీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గం రద్దు

- కన్వీనర్ గా నగునూరి శేఖర్ కు బాధ్యతలు...
- 60 రోజుల్లోగా ఎన్నికల నిర్వహణ

వివరాలు 3 లో



## ఒక ఇల్లు.. వంద ఓట్లు..

- పది పోలింగ్ బూత్ లకు మళ్ళింపు...
- ఆధారాలు సేకరించిన బీజేపీ...
- రాష్ట్ర ఎన్నికలాధికారికి ఫిర్యాదు..

3

## 100 కోట్లతో రహదారుల నిర్మాణం

- ప్రతిపాదించిన మంత్రి పొన్నం ప్రభాకర్..
- ఆర్అండ్ బీ మంత్రితో భేటీ...

(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్) వివరాలు 3 లో



# ఈటెల దారెటు...?

**● బీజేపీలో ఇమడలేక సతమతం.. ● బీఆర్ఎస్ స్థాయి కరువైందని ఆవేదన..**

**● కలకలం రేపుతున్న తాజా వ్యాఖ్యలు**

**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలపై తనదైన ముద్ర వేసిన ఈటల రాజేందర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరింత క్రియాశీలకంగా ఎదిగారు. 2014, 2018 ప్రభుత్వాల్లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజేందర్ అనూహ్యంగా బీఆర్ఎస్ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఉద్యమ నేపథ్యంలోనే రాజకీయాల్లోకి వచ్చిన రాజేందర్ రెండు రెండు దశాబ్దాలపాటు అందులో కొనసాగారు. అంచలంచెలుగా ఎదిగి కేసీఆర్ తర్వాత ఈటెలకే ఆ స్థాయి ప్రాధాన్యతను సంపాదించుకున్నారు. అయితే అనూహ్య పరిణామాల క్రమంలో కేసీఆర్ తన మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడమే కాకుండా, పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేశారు. భూ కబ్జాల ఆరోపణలతో కేసులు పెట్టించారు. దీంతో ఈటల రాజేందర్ బీఆర్ఎస్‌తో 20 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్నారు. ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి ఉప ఎన్నికలకు వెళ్లారు. ఆ సమయంలో కాంగ్రెస్, బీజేపీ రెండింటి నుంచి అవకాశం వచ్చినా.. కేసీఆర్‌ను ఎదుర్కొనాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలో చేరాలని నిర్ణయించుకుని కాషాయ కండువా కప్పుకున్నారు.



2004 నుంచి వరుసగా ప్రతీ ఎన్నికల్లోనూ విజయాలను నమోదు చేయడంతో పాటు ఉమ్మడి జిల్లాను ఏకతాటిపై నడిచేలా చేయడంలో రాజేందర్ కీలక పాత్ర పోషించారు. ఉప ఎన్నికల్లోనూ ఘన విజయాలతో ఉద్యమాన్ని ముందుకు నడిపించగలిగారు. కేసీఆర్ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అనుచర, అభిమానులు ఉన్న నేత ఈటెల రాజేందర్ అన్న దానిని పార్టీ వర్గాలన్నీ కూడా అనధికారిక చర్చల్లో ఇప్పటికీ అంగీకరిస్తారు.

### బీజేపీలోనూ కీలక పదవులు...

రెండేళ్లుగా బీజేపీలో ఉంటున్న ఈటల రాజేందర్ ఆ పార్టీలోనూ కీలక పదవులు కూడా నిర్వహించారు. పార్టీలో చేరిన తర్వాత పార్టీ అధిష్టానవర్గం ఈటెలకు సముచిత ప్రాధాన్యత కల్పించింది. చేరికల కమిటీ చైర్మన్‌గా నియమించింది. ఎన్నికల వేళ స్టార్ క్యాంపెయినర్ బాధ్యత కూడా అప్పగించారు. ఎన్నికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. సీనియర్ నేత కావడంతో సముచిత స్థానమే కల్పించింది. ఉప ఎన్నికల్లో హుజురాబాద్ నుంచి భారీ మెజారిటీతో గెలిచిన ఈటల మొన్నటి ఉప ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. హుజూరాబాద్‌తోపాటు, గజ్వేల్ నుంచి పోటీ చేశారు. కానీ రెండింటిలో ఓడిపోయారు. కేసీఆర్ టార్గెట్ గా పనిచేసినా ఫలితం లేకపోయింది. మరోవైపు ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన హుజూరాబాద్ ఓటర్లు తొలిసారి ఆయనను ఓడించారు.

### ఇమడలేక.. బయటకు రాలేక...

వామపక్ష భావజాలం కలిగిన ఈటెల రాజేందర్ బీజేపీలో ఇమడటం అసాధ్యమని తొలుత ప్రచారం జరిగినా క్రమేపీ ఆయన సర్దుకుపోవడంతో అంతా సాఫీగానే సాగుతుందని భావించారు. అయితే పార్టీ నాయకత్వం కీలక పదవులు అప్పగించినా కూడా రాజేందర్ ఇమడలేకపోతున్నారనే భావన ఆయన అనుచర గణంలో మొదటి నుంచి కూడా ఉన్నది. బీజేపీ సైద్ధాంతిక పార్టీగా చెప్పుకుంటున్నా ఇతర పార్టీల నుంచి వస్తున్న నేతల ఆగమనంతో ఆ పార్టీ కూడా ఇతర పార్టీల్లాగే కలహాల కుంపటిగా మారింది. నేతల మధ్య ఆధిపత్య పోరు పార్టీ ఎదుగుదలకు ఆటంకంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఈటెల కొంత స్తబ్దంగా ఉండిపోయారు. ఇదే సమయంలో లోక్ సభ ఎన్నికల వ్యవహారం తెర మీదకు రావడంతో తొలుత కరీంనగర్ లోక్ సభ టికెట్టు ఆశించినా తర్వాత సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ మరోమారు పోటీ చేయనుండటంతో ఆయన మల్కాజిగిరి టికెట్టు ఆశిస్తున్నారు. ఇదే సమయంలో కరీంనగర్ లో కాంగ్రెస్ నుంచి పోటీ చేయాలంటూ ఆ పార్టీ నుంచి ఒత్తిళ్ళు మొదలయ్యాయి. ఇక్కడ సరైన అభ్యర్థి లేనందున బలమైన సామాజికవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఈటెల కాంగ్రెస్ లోకి రావాలంటూ పలువురు నేతలు స్వయంగా ఆహ్వానించారు. అయితే రాజేందర్ సున్నితంగానే తిరస్కరించినా లోలోన మాత్రం బీజేపీ పరిస్థితిపై అసంతృప్తితో ఉన్నారని చెబుతున్నారు.

### పార్టీ మారడం తొందరపాటు నిర్ణయమా...

పార్టీ మారడంపై ఆయన ఇటీవల ఓ యూట్యూబ్ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూ లో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కలకలం రేపుతున్నాయి. తాను పార్టీ మారి తప్పు చేశానని చెప్పకే చెప్పారు. తనలా ఎవరూ తప్పు చేయొద్దని సూచించారు. 20 ఏళ్లు ఉన్న పార్టీలో దక్కిన గౌరవం కొత్త పార్టీలో కోరుకోవడం అత్యాశే అవుతుందన్నారు. అయినా సర్దుకు పోతున్నట్లు వెల్లడించారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వ్యాఖ్యల వెనుక మర్మం ఏమిటన్న దానిపై ఇప్పుడు పలువురు విశ్లేషణలు జరుపుతున్నారు. రాజేందర్ బీజేపీలో కొనసాగుతారా.. ఎంపీ టికెట్టు హామీతో కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తారా.. బీఆర్ఎస్ నుంచి ఆహ్వానం వస్తే పునరాలోచన చేస్తారా అన్న దానిపై ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.

**బీజేపీ, బీఆర్ఎస్ ను**

# మట్టికరిపిస్తా...

**● కరీంనగర్ లో కాంగ్రెస్ గెలుపు ఖాయం ● ఎంపీ టికెట్టుకు వెలిచాల దరఖాస్తు**



**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**

కరీంనగర్ లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ ను మట్టి కరిపిస్తానని కరీంనగర్ నేత వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. కరీంనగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది సోనియా గాంధీకి కానుకగా సమర్పిస్తానని ప్రకటించారు. శుక్రవారం గాంధీభవన్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ లోక్ సభ టికెట్టును ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ తన కుటుంబం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తూ వచ్చిందన్నారు. తండ్రి జగపతిరావు కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం పని చేశారని గుర్తు చేశారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశానని చెప్పారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి , ఎమ్మెల్యేల సహకారంతో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి విజయం సాధిస్తానన్నారు. ఏ కారణం వల్లనైనా తనకు పోటీ చేసే అవకాశం దక్కకపోయినా కూడా కరీంనగర్ లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ఎంపీ టికెట్టుకు దరఖాస్తులు..

కరీంనగర్ లోక్ సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ పక్షాన టిక్కెట్టు ఆశిస్తూ వెలిచాల రాజేందర్ రావుతో పాటు మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ స్థానం నుంచి ఈసారి ఎలాగైనా విజయం నమోదు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించడం.. మూడు చోట్ల బీఆర్ఎస్ గెలుపొందినా బీజేపీకి ఉన్న హుజురాబాద్ స్థానాన్ని కోల్పోవడం తమకు కలిసి వస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. లోక్ సభ ఎన్నికలు సాధారణంగా జాతీయ పార్టీల మధ్యనే జరిగే అవకాశం ఉండటం.. బీజేపీ సిట్టింగ్ సీటు కాగా.. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున ఈసారి కాంగ్రెస్ పార్టీ మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత లోక్ సభ స్థానాలకు ఇన్ చార్జిలను నియమించారు కూడా. కరీంనగర్ కు గతంలో ఎంపీగా అనుభవం ఉన్నందున పొన్నం ప్రభాకర్ కే ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇప్పటికే ప్రభాకర్ లోక్ సభ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ పార్టీ శ్రేణులను లోక్ సభ ఎన్నికల వైపు సన్నద్ధం చేసే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. టికెట్టు కోసం పలువురు నేతలు పోటీపడుతున్నా పార్టీ అధిష్టానవర్గం, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సిఫార్సులే కీలకమని అంచనా వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్సీ సంతోష్ కుమార్, పీసీసీ అధికార ప్రతినిధి మెన్నేని రోహిత్ రావు, పురుమల్ల శ్రీనివాస్, నేరేళ్ళ శారద, రుద్ర సంతోష్ కుమార్ సహా పలువురి పేర్లు ఇటీవలి వరకు ప్రచారంలో ఉన్నాయి. దరఖాస్తుల అనంతరం తుది జాబితా నుంచి ఏఐసీసీ జాబితాను పరిశీలించవచ్చని చెబుతున్నారు. ఈ నెల రెండో వారం తర్వాత ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా అప్రమత్తమై ఆ దిశగా అడుగులు వేస్తున్నది. వీలైనంత త్వరగా అభ్యర్థిత్వాలు ఖరారు చేసి ప్రచారంలోకి అడుగు పెడితే తప్ప ఆశించిన ఫలితాన్ని సాధించలేమన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉంది.

### టీయూడబ్ల్యూజే

# జిల్లా కార్యవర్గం రద్దు

● కన్వీనర్ గా నగునూరి శేఖర్ కు బాధ్యతలు...

● 60 రోజుల్లోగా ఎన్నికల నిర్వహణ...



**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కరీంనగర్ జిల్లా శాఖ కార్యవర్గాన్ని రద్దు చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ ఒక ప్రకటనలో సమావేశ తీర్మానాన్ని వెల్లడించారు. కరీంనగర్ జిల్లా యూనియన్లో జరుగుతున్న ఘటనలు, పరస్పర ఆరోపణలు ప్రత్యేకించి అధ్యక్షులు, కార్యదర్శుల మధ్య ఏర్పడిన పూడ్చలేని అగాథంపై సమావేశం సుదీర్ఘంగా చర్చించింది. ఈ పరిణామాలపై రాష్ట్ర కమిటీ విచారం వ్యక్తం చేస్తూ పరిస్థితిని చక్కదిద్దేందుకు నడుం బిగించింది. జిల్లా కమిటీ కార్యవర్గ కాలపరిమితి యూనియన్ నిబంధనావళి ప్రకారం ముగిసిన నేపథ్యంలో జిల్లా కార్యవర్గాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర కమిటీ పలు నిర్ణయాలు తీసుకున్నది. జిల్లాలో సభ్యత్వాలు, మహాసభ నిర్వహించి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక కోసం అడహక్ కమిటీని నియమించింది. ఈ ప్రక్రియను సజావుగా సాగేలా చూసేందుకు రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్ ను కన్వీనర్ గా..కె. విరహత్, ఎం మల్లయ్యను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ అవసరమైతే మరో ఇద్దరిని జిల్లా నుంచి చేర్చుకొని 60 రోజుల్లోగా పని పూర్తి చేయాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా యూనియన్ కు సంబంధించి మినిట్స్ బుక్, ఇతర ఫైళ్ళను, కార్యాలయాన్ని నగునూరి శేఖర్ కు అప్పగించి సహాయ సహకారాలు అందించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు జారీ చేసిన లేఖలో పేర్కొన్నారు. కాగా.. గురువారం సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జిల్లా నుంచి బల్మూరి విజయసింహరావు, గాండ్ల శ్రీనివాస్, ఎండీ ఇమామ్ ను నియమించారు. తాజా పరిణామాలతో రానున్న రెండు మాసాల్లోగా జిల్లా యూనియన్ ఎన్నికలు జరగడం ఖాయమని తేలిపోయింది.

# 100 కోట్లతో రహదారుల నిర్మాణం

**-ప్రతిపాదించిన మంత్రి పొన్నం ప్రభాకర్ - ఆర్అండ్ బీ మంత్రితో భేటీ**




**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్ :** తొలిసారిగా హుస్నాబాద్ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి గెలుపొంది రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి 100 కోట్ల రూపాయల మంజూరీని కోరుతూ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నాలుగు ప్రధాన రహదారుల నిర్మాణం కోసం 100 కోట్ల రూపాయల మంజూరీ ఇప్పించాలంటూ జిల్లా ఇన్ చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. హుస్నాబాద్ నుండి రామవరం వరకు గల 11.5 కి. మీ ల దూరానికి 25 కోట్ల రూపాయలు... అంతక్ పేట్ నుండి కొత్త కొండ వరకు 10 కి. మీ ల దూరానికి మరో 25 కోట్ల వ్యయం తో, గన్నేరు వరం నుండి బెజ్జంకి వరకు 10 కి. మీ ల దూరం 25 కోట్ల వ్యయం తో, రాంనగర్ తండా నుండి మడిపల్లి క్రాస్ వరకు 10 కి. మీ ల దూరం రూ. 25 కోట్ల వ్యయంతో నిర్మించ బోయే ఆర్అండ్ బీ తారు రోడ్లకు నిధులు మంజూరు చేయాలని సంబంధిత శాఖల మంత్రులు, కార్యదర్శులను కలిసి ప్రతిపాదనలు అందజేశానని మంత్రి పొన్నం పేర్కొన్నారు.

# ఒక ఇల్లు.. వంద ఓట్లు...

● పది పోలింగ్ బూత్ లకు మళ్ళింపు

● ఆధారాలు సేకరించిన బీజేపీ ● రాష్ట్ర ఎన్నికలాధికారికి ఫిర్యాదు..



**(కరీంనగర్, ఎలగందల్ టైమ్స్)**
కరీంనగర్ అసెంబ్లీ ఎన్నికల్లో పలు చోట్ల దొంగ ఓట్లు పోలయ్యాయి. ఒకే ఇంటి డోర్ నెంబర్ పై వంద ఓట్లు నమోదు చేయడమే ఇందుకు ఉదాహరణగా తెలుస్తోంది. పైగా ఆ ఓట్లన్నీ వేర్వేరు పోలింగ్ బూత్ లకు కేటాయించడం గమనార్హం. ఒకే ఇంటి నెంబర్ పై ఉన్న వంద ఓట్లను అధికారులు 10 పోలింగ్ బూత్ లకు మళ్లించడం ద్వారా ఆ ఓట్లను దొంగ ఓట్లుగా బయటపడకుండా చూసేందుకు సంబంధిత అధికారులు తమ వంతు సహకారం అందించారని బీజేపీ ఆరోపిస్తున్నది. ఒక ఇంటి నెంబర్ కు ఒక ఓటు మాత్రమే ఉన్న ఇండ్లు 50 వేల వరకు ఉన్నాయని తెలిపారు. పైగా 1 లక్షా 78 వేల ఓటర్లను వాళ్ల సమీప పోలింగ్ బూత్ లకు కాకుండా 3 నుండి 10 కిలోమీటర్ల దూరంలోనున్న పోలింగ్ బూత్ లకు కేటాయించడం ద్వారా తమకు ప్రతికూలంగా ఉంటారని భావించిన వారు పోలింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా చూసేందుకు ఎత్తుగడ వేశారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ లో అత్యల్ప ఓటింగ్ నమోదు కావడానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని బొమ్మకల్ గ్రామంలో గల చల్మెడ మెడికల్ కాలేజీ పరిసరాల్లోని 124,125,126 పోలింగ్ బూత్ ల పరిధిలో భారీ ఎత్తున దొంగ ఓట్లు పోలయ్యాయని వారు ఆరోపించారు. మెడికల్ కాలేజీల్లో చదువు పూర్తయి సొంతూర్లకు వెళ్లిపోయిన విద్యార్థులను ఓటర్ లిస్టు నుండి తొలగించాల్సి ఉండగా.. అధికారులు పాత వాటిని కొనసాగిస్తూ .. కొత్త విద్యార్థులకు కూడా ఓటు అవకాశం కల్పించడంతో పోలింగ్ ఈ బూత్ లలో భారీ ఎత్తున నమోదైంది.

ఆధారాలతో సహా రాష్ట్ర ఎన్నికల సంఘానికి బీజేపీ నేతలు పొన్నం వెంకటరమణ, బి.అజయ్ కుమార్, పవన్ కుమార్, రాజ్ కుమార్ ఫిర్యాదు చేశారు. కరీంనగర్ లో జరుగుతున్న ఈ దొంగ ఓట్ల గురించి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీంతో
వెంటనే జిల్లా కలెక్టర్ తో మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి బీజేపీ నేతల ఫిర్యాదుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# భూ పోరాట నాయకులను జైలులో ఉంచేందుకు కుట్ర

- జగిత్యాల జిల్లాలో పోలీసు యాక్టును ఎత్తివేయాలి
- ముఖ్యమంత్రి వాగ్దానం ప్రకారం భూ పోరాట కేసులను రద్దు చేయాలి
- జైలులో ఉన్నవారిని పరామర్శించిన రాష్ట్ర నాయకుల బృందం

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** నిలువ నీడలేని పేదలకు ఇండ్ల జాగా కావాలని కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలలో ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసే పోరాటానికి నాయకత్వం వహించిన 11 మంది నాయకులపై 307 R/w, 143, 148, 148 సెక్షన్లను బనాయించి కరీంనగర్ జైలుకు పంపడం ఆందోళన కలిగించే అంశం అని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ళ ఆశయ్య, బి ప్రసాద్, కరీంనగర్ జిల్లా పార్టీ కార్యదర్శి వాసుదేవ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం ములాఖత్‌లో 18 రోజుల నుండి కరీంనగర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న వాళ్లను పరామర్శించారు.



అనంతరం వారు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ భూ పోరాట ఉద్యమ, ప్రజా ఉద్యమాల సందర్భంగా నాయకుల పైన పెట్టిన కేసులు అన్ని ఎత్తివేస్తామనీ ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. కానీ ఆచరణలో మెట్పల్లి డిఎస్పి, జగిత్యాల డిఎస్పి ఇద్దరు కలిసి జైల్లో ఉన్న నాయకులకు బెయిల్ రాకుం డా అడ్డుకునేందుకు కొత్తగా అదనపు సెక్షన్లతో ఎఫ్ఐ ఆర్ యాడ్ చేయడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందనే అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు. నాయకులపై 149/R/W, 296/R/W, 147, 186, 353, 506 సెక్షన్లను కొత్తగా కలిపి ఎఫ్ఐఆర్ బుక్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. నాయకులను బయటి రాకుండా జైల్లోనే నిర్బంధించే చర్యలకు పోలీస్ యంత్రాంగం ప్రయత్నం చేస్తుందని, ఒకవేళ బయటికి వస్తే వారిపై పిడి యాక్ట్ ఓపెన్ చేసామనీ బెదిరింపు చర్యలకు దిగడంతో పాటు జగిత్యాలలో ఫిబ్రవరి నెల మొత్తం పోలీసు యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రకటించడం ప్రజాస్వామ్య హక్కులకు, మానవ హక్కులకు పొంచి ఉన్న ప్రమాదంగా పేర్కొన్నారు. తక్షణమే జిల్లా ఎస్పీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే కొత్తగా యాడ్ చేసిన సెక్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వివిధ పోలీస్ స్టేషన్లలో భూ పోరాట నాయకులపై పెట్టిన బైండోవర్ కేసులు, స్టేషన్ బెయిల్ కేసులు అన్నింటిని తక్షణమే రద్దు చేయాలని కోరారు. కౌన్సిలింగ్ పేరుతో భూపోరాట కమిటీ నాయకులను వ్యక్తిగతంగా పోలీస్ స్టేషన్లకు పిలిచి బెదిరించే చర్యలు ఆపాలని కోరారు

ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకున్న పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పట్టా ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సాయం తక్షణమే అందించాలని కోరారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్ పటేల్ నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రత్యేక అధికారుల బాధ్యతల స్వీకరణ



**చిగురుమామిడి, ఎలగందల్ టైమ్స్:** తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018, సెక్షన్ 136 (3) కింద గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు చిగురు మామిడి మండలంలోని 17 గ్రామాలలో ప్రత్యేక అధికారులుగా శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పదవీ బాధ్యతలు చేపట్టారు. గునుకుల పల్లె గ్రామంలో ఎంపీడీవో మామిడిపల్లి నరసయ్య, ఇందుర్తిలో ఎంపీఓ శ్రావణ్ కుమార్ ప్రత్యేక అధికారులుగా పదవీ బాధ్యతలు చేపట్టడంతో లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాజా మాజీ సర్పంచ్ అందె స్వరూపస్వామి, మాజీ ఉపసర్పంచు తోట సతీష్, గునుకులపల్లి తాజా మాజీ ఉప సర్పంచ్ కూన పోశయ్య, కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, శ్రావణ్‌కుమార్‌లతో కలిసి సీనియర్ జర్నలిస్టు లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథ్ రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

గ్రామాల వారిగా బాధ్యతలు చేపట్టిన అధికారులు బొమ్మనపల్లి వినయ్ సాయి, అసిస్టెంట్ ఇంజనీర్ (ఆర్‌డబ్ల్యుఎస్), చిగురుమామిడి మామిడిపల్లి నర్సయ్య, ఎంపీడీవో, గాగిరెడ్డిపల్లె ఎండి ఖజా మొహియుద్దీన్, సూపరిండెంట్, గునుకులపల్లె మామిడిపల్లి నర్సయ్య, ఎంపీడీవో, ఇందుర్తి పి శ్రావణ్ కుమార్, ఎంపీఓ, కొండాపూర్ శ్రీధర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, లంబాడిపల్లె పి శ్రావణ్ కుమార్, ఎంపిఓ, మధుమాణిక్యం ఈ నరేందర్, తహసీల్దారు, ముల్కనూర్ జమున రాణి, అసిస్టెంట్ రిజిస్టర్, నవాబుపేట ఎంపిడిఓ నర్సయ్య, ఓగులాపూర్ శ్రీనివాస్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పీచుపల్లి శ్రీనివాస్ రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, రేకొండ రంజిత్ రెడ్డి, మండల్ అగ్రికల్చర్ ఆఫీసర్, సీతారాంపూర్ పార్థసారధి డిప్యూటీ తహసీల్దార్, సుందరగిరి ఈ నరేందర్, తహసిల్దార్, ఉల్లంపల్లి రాజశ్రీ, ఐసిడిఎస్ సూపర్వైజర్. బాధ్యతలు చేపట్టిన అధికారులను పంచాయతీ కార్యదర్శులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు శాలువాలతో సన్మానించి అభినందించారు.




# మెకానిక్స్, ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఏర్పాటు శుభ పరిణామం

**హుస్నాబాద్, ఎలగందల్ టైమ్స్:** హుస్నాబాద్‌లో మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు కలిసి హుస్నాబాద్ మెకానిక్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అని గౌరవ అధ్యక్షులు మేకల వీరన్న యాదవ్ అన్నారు. వృత్తి పట్ల బాధ్యతగా ఉంటూనే, సమాజ హితానికి దోహదం చేయాలన్నారు. అసంఘటితంగా ఉన్న మీరు సంఘటిత శక్తిగా ఎదగాలన్నారు. సమాజ సమస్యల పట్ల కూడ మీ వంతు బాధ్యతగా స్పందించాలని, మీ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలాన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. అడిగిన వెంటనే స్పందించి మీకు మంత్రి ఆటోనగర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం పట్ల మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మేకల వీరన్న యాదవ్



హుస్నాబాద్ మెకానిక్స్ మరియు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా జక్కుల రమేష్, గౌరవ అధ్యక్షులుగా మేకల వీరన్న యాదవ్, గౌరవ సలహాదారులుగా బండారి బాల కిషన్, ఆడపల పుల్లారావు, ఉపాధ్యక్షులుగా మడిపల్లి వీరాస్వామి, ప్రధానకార్యదర్శిగా బైకిని వెంకటేష్, కోశాధికారిగా గోనెల చిరంజీవి, కార్యదర్శులుగా దామెర రమేష్, గాదర్ల గణేష్, ప్రచార కార్యదర్శిగా ముత్తన్నగారి రాజిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కలవేణి సంపత్, ఎడ్ల భూమయ్య, బైకిని కృష్ణమూర్తి, బండి సంతోష్.

# ఉపాధి కూలీలకు మరణశాసనం కేంద్ర బడ్జెట్

**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్**




**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు మరణ శాసనం విధించిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ ఆరోపించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రతి సంవత్సరం బడ్జెట్లో కోత విధించి నట్టుగానే గురువారం జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులు తక్కువ చేశారని అన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం లో కేటాయించి 87 వేల కోట్ల తో పాటు మరో 15 వేల కోట్ల రూపాయల వరకు చేసిన పనులకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాది కంటే తక్కువ కేటాయింపులు చేసి ఎక్కువ బడ్జెట్ కేటాయింపులు చేశామని అబద్దపు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దేశంలో ఉపాధి కూలీలందరికి పని కల్పించడానికి 2 లక్షల కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని నిపుణులు చెప్పినా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కేంద్ర ప్రభుత్వ తప్పుడు నిర్ణయాల వల్ల ఈ ఏడాది 1/3 వంతు ఉపాధి కూలీలు పనికి దూరం అయ్యే ప్రమాదం ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం పని కట్టుకొని బడ్జెట్లో నిధుల కేటాయింపులలో కోత పెడుతూ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. ప్రజా పంపిణీ, విద్యా, వైద్యం, గృహ నిర్మాణం, ఉపాధి హామీ తదితర పథకాలకు బడ్జెట్లో సరైన నిధులు కేటాయించకుండా కార్పొరేట్ పక్షపాతినని నరేంద్రమోదీ మరొకసారి రుజువు చేసుకున్నారని సృజన్‌కుమార్ విమర్శించారు.

## కార్పొరేట్లకు అనుకూలమైన బడ్జెట్

**- పైడిపల్లి రాజు**



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్న బడ్జెట్ అని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగాన్ని సహకార సంఘాలను, ఎంఎస్ఎంఈలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవడానికి బదులుగా ఈ కార్యకలా పాలన్నింటినీ కార్పొరేట్ సంస్థలకు గంపగుత్తగా అప్పగించేందుకు మోడీ సర్కార్ కుట్ర పన్నిందని ఆయన విమర్శించారు.

2023-24 కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి రూ.2,22,281 కోట్లు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ వాస్తవంగా ఖర్చుచేసింది 1,17,528.79 కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు.

దేశాన్ని వ్యవసాయ దిగుమతు ల కేంద్రంగా తయారు చేస్తూ వ్యవసాయ ఉత్పత్తులపై కార్పొరేట్ సంస్థలు ఆధిపత్యం చెలాయించేలా నిధులు తగ్గిస్తు న్నారని గతంలో ఉపసంహరించు కున్న నల్ల చట్టాలను మరో కోణములో అమలు జరపడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర బీజేపీ సర్కార్ తీసుకుంటున్న రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు తెలంగాణ రాష్ట్ర రైతాంగం ఉద్యమాలకు సిద్ధం కావాలని పైడిపల్లి రాజు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# సమ్మక్క సారక్క జాతర పనులు ప్రారంభం



**ఓదెల, ఎలగందులు టైమ్స్:** ఓదెల మండలం కొలనూరు గ్రామంలో చిలకలగట్టు గుట్టల్లో సమ్మక్క సారక్క జాతర పనులను మండల కాంగ్రెస్ అధ్యక్షులు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓదెల మండలంలోని అతి పెద్ద జాతర కొలనూరు సమ్మక్క సారక్క జాతర దూర ప్రాంతాల నుండి సింగరేణి ప్రాంతం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి సమ్మక్క సారక్కను దర్శించుకుంటారని తెలిపారు. సమ్మక్క సారక్క జాతరకు వచ్చిపోయే భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా రోడ్లు తాగు నీరు, విద్యుత్ దీపాలు సౌకర్యంగా ఉండాలని సంబంధిత అధికారులను కోరినట్లు తెలిపారు. ఆయన వెంట చీకట్ల మొండయ్య బోడకుంట శంకర్, ఎంబడి మల్లేష్, బైరి రవి, కుంచం మల్లయ్య, కర్రే సంజీవరెడ్డి, కొలనూరు మాజీ సర్పంచ్ సామ మనెమ్మ శంకర్, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

# సర్పంచుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం



**కోహెడ, ఎలగందల్ టైమ్స్:** సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొక్కుల కీర్తిసురేష్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆత్మీయ వీడుకోలు సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని 27 గ్రామాల సర్పంచిల పదవీ కాలం ముగింపు సందర్భంగా బస్వాపూర్ సర్పంచి ఏడబోయిన సత్తయ్య, ఆరేపల్లి సర్పంచి లావుడియా సరోజన, బత్తులవాన్ పల్లి సర్పంచి కన్నం లక్ష్మి, సిసిపల్లి సర్పంచి భీమ్ రెడ్డి సత్యవతి, ధర్మసాగర్ పల్లె సర్పంచి లోనే సుజాత, ఎర్రగుంటపల్లె సర్పంచి నాగు మల్లవ్వ, గొట్టమిట్ట సర్పంచి బొల్లుమల్ల చంద్రయ్య, గుండారెడ్డిపల్లి సర్పంచి ఓరుగంటి అశోక్ రెడ్డి, కాచాపూర్ సర్పంచి ఎనగందుల తిరుపతి, మైసంపల్లి సర్పంచి తాళ్లపల్లి రవి, నాగసముద్రాల సర్పంచి తైదాల రవీందర్, నకిరేకొమ్ముల సర్పంచి వెల్దండి సతీష్, నారాయణపూర్ సర్పంచి ఆదవేణి కనకయ్య, పరివేద సర్పంచి లింగం గీతాంజలి, పోరెడ్డిపల్లి సర్పంచి సంపత్ తిరుపతిరెడ్డి, రామచంద్రపూర్ సర్పంచి, నోముల పద్మ, పెద్ద సముద్రాల సర్పంచి పిల్లి మాధవి, శనిగరం సర్పంచి కర్ర జయశ్రీ, శ్రీరాములపల్లి సర్పంచి ముంజ మంజుల, తంగళ్ళపల్లి సర్పంచి పాము నాగేశ్వరి, తీగలకుంటపల్లి సర్పంచి చంద్రశేఖర్ రెడ్డి, వరికోలు సర్పంచి కొయ్యడ చంద్రకళ, వెంకటేశ్వర్లపల్లి సర్పంచి తోట భాగ్యలక్ష్మి, విజయనగర కాలనీ సర్పంచి మెట్టు రాజేందర్ రెడ్డి, వింజపల్లి సర్పంచి బద్ధం తిరుపతిరెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించి షీల్డ్‌లు అందజేశారు.

ఈ సందర్భంగా ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్ మాట్లాడుతూ సర్పంచుల సేవలు ఎంతో బాగా చేశారని వారితో గత ఐదు సంవత్సరాలుగా ఉన్న అనుబంధం మరిచిపోలేనిదని అన్నారు. గ్రామస్థాయిలో అభివృద్ధి కొరకు పాటుపడిన వారి సేవలు ఎంతో ఉపయోగపడ్డాయని, ఇక ముందు కూడా సమాజ సేవ చేయడానికి ముందుకు రావాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి వైస్ ఎంపీపీ తడుకల రాజిరెడ్డి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ తిప్పారపు జ్యోతి శ్రీకాంత్, బిజెపి మండల అధ్యక్షులు ఖమ్మం వెంకన్న, ఎంపీటీసీలు మల్లవ్వ, విజయ, సుజాత సురేందర్, నిర్మల శ్రీనివాస్, కళ్యాణి, స్వప్న శేఖర్, ఎమ్మార్వో సురేఖ, ఎంపీడీవో మధుసూదన్, సీనియర్ నాయకుడు కర్ర రవీందర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల మహేందర్, తోట ఆంజనేయులు, మాజీ జెడ్పీటీసి పొన్నాల లక్ష్మయ్య, కొడముంజ రాజు, మండల యూత్ అధ్యక్షులు జాలిగం శంకర్, మండల పరిషత్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# 16న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

**ఏఐఆర్‌టీడబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి**

**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక సంఘాలు, వివిధ రంగాల ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్ల ఐక్యవేదిక ఫిబ్రవరి 16న అఖిల భారత స్థాయిలో కార్మికుల సమ్మెతో పాటు గ్రామీణ భారత్ బంద్ పాటించాలని నిర్ణయించారు, ఈ నిర్ణయంలో భాగంగా రాష్ట్రంలో రవాణా రంగా కార్మికులు కూడా సమ్మెలో పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని, తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు పిలుపిస్తోందని పారిశ్రామిక విధాల చట్టం 1947 సెక్షన్- 22 సబ్ సెక్షన్ (1) అనుసరించి ఎఐఆర్ టీడబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు పున్నం రవిచ లారీ డ్రైవర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు ఎంకే, ఆరిఫ్ మొయినుద్దీన్ కలిసి తిమ్మాపూర్ రవాణా శాఖ కార్యాలయంలో ఇన్చార్జి సురేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఫిబ్రవరి 16న జరిగే దేశ కార్మిక సమ్మెలో గ్రామీణ భారత్ బంద్ రవణారంగ కార్మికులు అన్ని రకాల వాహనాలు డ్రైవర్లు ఆటో, క్యాబ్, లారీ, డిసిఎం, స్కూల్ బస్సు, జీపు, అంబులెన్స్, ట్రాక్టర్ హెయిర్ బస్, ట్రాలీ, టాటా ఏసీ, రెడీమిక్స్, డ్రైవర్స్ భాగస్వామ్యం కావాలని కోరారు. మోడీ నేతృతంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో రోడ్డు రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిడుతుందని, క్రూడ్ ఆయిల్ ధరలు 2014 కంటే తక్కువగా ఉన్నప్పుడు, కూడా పెట్రోలు, డీజిల్ ఆసాధారణంగా పెరగడం ఇన్సూరెన్స్



భారీ పెంపుదల, టోల్ టాక్సీ సవరణ తర్వాత పరిశ్రమతో పాటు కార్మికులను ఇప్పటికే నాశనం చేసింద్రు అని విమర్శించారు. హిట్ అండ్ రన్ (106) (1)(2) రద్దు చేయాలని, ఎమ్.వి. యాక్ట్ 2019 సవరణ చట్టం రాష్ట్రంలో అమలు చేయొద్దని, ప్రభుత్వమే ఆన్లైన్ యాప్ తీసుకురావాలి మూడు నెలలపాటు ఆటోల మీద ఈఎంఐ మారటోరియం ప్రకటించాలని, ప్రమాద బీమా 5 లక్షలు, ఆరోగ్య శ్రీ విధాన పరిరక్షణ ఉచిత వైద్యం మొత్తం రవాణా రంగా కార్మికులకు వర్తింపజేయాలని, ఆటో డ్రైవర్ల ఇన్సూరెన్స్ ప్రభుత్వం భరించాలని, మహిళలకు ఉచితం ఫ్రీ బస్సు ద్వారా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్లు జీవన భృతి నెలకు 4,500 ఇవ్వాలని కోరారు. నగరంలో టాక్సీ స్టాండ్లు అడ్డస్థలాలు ఏర్పాటు చేయాలి కోరారు.

## దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాలి..

**తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్**



ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని జిల్లా లేబర్ కమిషనర్‌కు ఏఐటీయూసీ నేతలు (సమ్మె నోటీస్) వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యలు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా కార్మిక రైతు వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న కార్మికులు సమ్మె పాటించాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు కోకొల్లలుగా ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, కార్మికుల క్లెయిమ్స్ ఆన్లైన్లో ఆధార్ నెంబర్లు రావడం లేదని క్లెయిమ్స్ పెండింగ్‌పై ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని, కార్మికులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అందరికీ సార్వత్రిక నాణ్యమైన ఆరోగ్యం, విద్యను కేంద్రం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల శ్రీనివాస్ కార్యవర్గ సభ్యులు నరసయ్య, సుల్తాన్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు మోదీ మోసం: ఎంపి వెంకటేష్ నేత



**పెద్దపల్లి, ఎలగందుల టైమ్స్:** కృష్ణా జలాలపై కేంద్ర పెత్తనాన్ని నిరసిస్తూ తెలంగాణ నీటి వాటా హక్కులను కాపాడాలని కోరుతూ కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర శేఖావత్‌కు సహచర బీఆర్ఎస్ పార్టీ ఎంపీలతో కలిసి వినతిపత్రాన్ని పెద్దపల్లి ఎంపీ డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీలు కేశవ రావు, నామ నాగేశ్వరరావు, రంజిత్ రెడ్డి, సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

### వ్యాపార సముదాయాల వద్ద

# సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**హుస్నాబాద్, ఎలగందుల టైమ్స్:** వ్యాపార సముదా యాలు దుకాణల ఎదుట యజమానులు సిసి కెమెరాలు తప్పకుండా అమర్చుకోవాలని హుస్నాబాద్ ఎస్సై మహేష్ సూచించారు. హుస్నాబాద్ పట్టణంలో వాణిజ్య వ్యాపార కేంద్రాలు దుకాణాలను ఎస్సై మహేష్ సంద ర్శించారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాలు సరైన భద్రత చర్యలు పాటించని యజమానులకు నోటీసులు జారీ చేశారు. ప్రజా ప్రాతినిథ్య చట్టం 2019 ప్రకారం వర్తక వ్యాపార కేంద్రాల ఎదుట యజమానులు తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమాన మని, ఏదైనా నేరం జరిగితే నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాలు ప్రత్యక్ష



సాక్షులుగా ఉపయోగపడతా యన్నారు. అదే విధంగా ఇంటి యజమానులు కూడా సీసీ కెమెరాలు పెట్టుకుంటే భద్రతపరంగా బాగుం టుందని సూచించారు.

## త్రిపుర గవర్నర్‌ను కలిసిన విహెచ్‌పి నాయకులు



**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి కరీంనగర్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని విశ్వహిందూ పరిషత్ గోరక్షక్ ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, నగర కార్యదర్శి మనోజ్ లాహెూటిలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థులు



**పెద్దపల్లి, ఎలగందుల టైమ్స్:** జనవరి 14న గోదావరిఖనిలోని డిగ్రీ పీజీ కళాశాలలో జిల్లా స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల ఫిబ్రవరి 3, 4 వ తేదీన మెదక్ జిల్లా తూప్రాన్ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రైజింగ్‌సన్ పాఠశాల విద్యార్థులు ఫర్హా, శ్రేష్ఠ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తగురం తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్ ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ విద్యార్థులను అభినందించారు.

## బీసీ కుల గణనను చేపట్టడం హర్షణీయం



**పెద్దపల్లి, ఎలగందుల టైమ్స్:** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పెద్దపల్లి జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తాడూరు శ్రీమన్నారాయణ కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీ కుల గణనతో బీసీ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 20 వేల కోట్లు కేటాయించాలని శ్రీమన్నారాయణ కోరారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో సత్వర న్యాయం జరగాలంటే కుల గణన ద్వారానే సంపూర్ణ సాధికారత లభిస్తుందని అన్నారు.

# మేడారం జాతరలో ప్రధాన సమస్యలు

**మేడారం, ఎలగందల్ టైమ్స్:** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సమీపిస్తోంది. మరో 20 రోజులే గడువు ఉంది. దీంతో అధికారులు నిత్యం ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. దాదాపు మూడు నెలలుగా పనులు జరుగుతూనే ఉన్నా.. ఇంకా అనేక సమస్యలు కనిపిస్తున్నాయి. సౌకర్యాలు కానరావడం లేదు. మరో పక్షం రోజుల్లో పనులు పూర్తి చేయకపోతే తిప్పలు తప్పవంటున్నారు భక్తులు.

**ప్రధాన సమస్యలివీ..**

మూడు నెలలుగా పనులు చేస్తున్నా.. ఇప్పటికీ మేడారంలో కనిపిస్తున్న ప్రధాన సమస్యలు ఇలా ఉన్నాయి.

– భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో ఇంకా వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు.

– భక్తుల స్నానాలకు జంపన్న వాగులోకి ఇప్పటికీ శుభ్రమైన నీరు విడుదల చేయలేదు.

– ట్రాఫిక్ నిర్వహణ సక్రమంగా జరుగడం లేదు. జాతర ప్రారంభం కాకముందే వాహనాలు రోడ్లపై నిలిచిపోతున్నాయి.


– జాతరలో తల్లులకు బలి ఇచ్చే జంతువుల వ్యర్థాలను ఇష్టానుసారంగా పడేస్తున్నారు. వాటిని శుభ్రం చేయడం లేదు.

– వృద్ధులు, చిన్న పిల్లలు, వీఐపీల దర్శనాలకు ఏర్పాట్లు చేయలేదు.

**ట్రాఫిక్ ప్రధాన సమస్య..**

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం మహాజతర సమీపిస్తోంది. జాతరకు రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే తల్లులను దాదాపు 25 లక్షల మంది దర్శించుకున్నారు. అయితే జాతరకు వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారింది. వాహనాలు తరచూ నిలిచిపోతున్నాయి. జాతరకు ముందే ఇలా ఉంటే జాతర నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అని భక్తులు ఆందోళన చెందుతున్నారు.



**టోల్‌గేట్ కష్టాలు..**

హైదరాబాద్ నుంచి వచ్చేవారిని టోల్‌గేట్ కష్టాలు వెంటాడుతున్నాయి. వారు నాలుగు టోల్‌గేట్లు దాటాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. మరోవైపు టోల్ భారం రూ.550 వరకు పడుతుంది. యాదాద్రి జిల్లా గూడూరు, జనదామ జిల్లా కోమల్ల, హనుమకొండ జిల్లా కోమటిపల్లి, ములుగు జిల్లా జవహర్‌నగర్ వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి. వాహనాలు స్థాయిని బట్టి రూ.200 వరకు టోల్ చార్జీలు వసూలు చేస్తున్నారు. మరోవైపు ఏటూరు నాగారం, తాడ్వాయిలో ఏటూరు నాగారం వద్ద అటవీశాక చెక్‌పోస్టులు ఏరాపటు చేసింది. పర్యావరణ పరిరక్షణ చార్జీల పేరుతో వీళ్లు రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఇక మేడారంలో పంచయతీ సిబ్బంది, పార్కింగ్ సిబ్బంది కూడా అదనంగా రుసుము వసూలు చేస్తున్నారు.

# కొనసాగుతున్న ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్




**కరీంనగర్, ఎలగందల్ టైమ్స్:** కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యల్లో భాగంగా కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు వరుస స్పెషల్ డ్రైవ్‌లు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ శుక్రవారం నాడు కరీంనగర్ కమీషనరేట్ ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థుల భద్రత దృష్ట్యా పిల్లలను స్కూళ్లకు చేరవేసే ప్రయివేటు బస్సులు, వ్యాన్‌లు, ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటుగా, డ్రైవర్స్ చరిత్ర గతంలో ఏమైనా రోడ్డు ప్రమాదాలకు గురిచేసిన కేసులు ఉన్నాయా లేదా ఆరా తీశామన్నారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్, ఇతర ధ్రువపత్రాలు, పొల్యూషన్ మరియు ఇన్సూరెన్సులు తనిఖీ చేసారు. స్కూల్ బస్సులు, వ్యాన్‌లు, ఆటోలు, టెంపో వాహనాలను నడుపుతున్న డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ నందు వివిధ స్కూళ్ళు మరియు కాలేజీలకు చెందిన 52 వాహనాలను తనిఖీ చేశామన్నారు. సరైన పత్రాలు లేని 18 వాహనాలను గుర్తించి వారికి ఈ చలాన్ ద్వారా జరిమానాలు విధించామన్నారు. ఈ తనిఖీల్లో చాలా వరకు స్కూళ్లకు చెందిన బస్సుల్లో చిన్న పిల్లల కోసమై కేర్ టేకర్‌లు అందుబాటులో వుంచట్లేదని గుర్తించామన్నారు. ఆయా పాఠశాలలు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించామన్నారు. కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా స్కూల్ బస్సులు, వ్యాన్‌లు నడిపే వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్సుతో పాటుగా వాహనానికి సంబంధించిన సరైన ధ్రువపత్రాలు కలిగివుండాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన వాహనదారులను గుర్తించడమే కాకుండా వారికి ఈ చలాన్ ద్వారా జరిమాన కూడా విధిస్తామన్నారు. కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలు పాటించకుండా పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ ఇషాక్, ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

**పెద్దపల్లి, ఎలగందుల టైమ్స్:** 2023–24 విద్యా సంవత్సరంలో పోస్ట్ మెట్రిక్ రెన్యువల్ ఫ్రెష్ స్కాలర్షిప్‌ల దరఖాస్తు గడువు మార్చి 31 వరకు పొడిగించడం జరిగిందని జిల్లా షెడ్యూ ల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఎం. నాగైలేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులు, కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల్లోనీ ఎస్సి విద్యార్థిని, విద్యార్థులు అందరూ స్కాల ర్షిప్‌లు పొందుటకు వీలుగా విద్యార్థుల యొక్క వివరాలను వారి దరఖాస్తులలో సరిగా పరిశీలించి http://telanganaepass.cgg.gov.in ఈ ఆన్లైన్ వెబ్ సైట్‌లో పొందుపరచాలని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి ఎం. నాగైలేశ్వర్ తెలిపారు.

## లక్ష్యాన్ని అధిగమించిన ఆర్.ఎఫ్.సి.ఎల్




**గోదావరిఖనద, ఎలగందుల టైమ్స్:** రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్.ఎఫ్.సి.ఎల్.) జనవరి నెలలో యూరియా ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. కర్మాగారం వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులు. సంవత్సరంలో 12 నెలల్లో ఒక నెల వార్షిక మరమ్మతులకు వదిలేయగా వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని మిగతా 11 నెలలకు విభజిస్తే ప్రతి నెలా సుమారుగా 1.15 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి చేయాలి. కాగా జనవరిలో 1.22 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో లక్ష్యాన్ని అధిగమించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో తరచూ సాంకేతికపరమైన అవాంతరాలతో కొన్ని సార్లు, నెల, పక్షం రోజులు యూరియా ఉత్పత్తి నిలిపివేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జనవరిలో దాదాపుగా అవాంతరాలు లేకపోవడంతో నెలవారి ఉత్పత్తిలో జనవరి అగ్రగామిగా నిలిచినట్లు భావిస్తున్నారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో జనవరి ఉత్పత్తి 1.22 లక్షల మెట్రిక్ టన్నుల్లో 51వేల మెట్రిక్ టన్నులు తెలంగాణకు, 19,091 మెట్రిక్ టన్నులు ఆంధ్రప్రదేశ్‌కు సరఫరా చేయగా మిగతా ఉత్పత్తిని కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 2023తో ముగియనున్న మూడో త్రైమాసికం వరకు 8.19 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తితో సుమారు రూ.300 కోట్ల నికర లాభం ఆర్జించినట్లు భావిస్తున్నారు. జనవరిలో 1.22 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో ఇప్పటి వరకు మొత్తం 9.42 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.86.52 కోట్ల నికర లాభం ఆర్జించగా ఆ తర్వాత తరచూ అవాంతరాలతో సుమారు 12సార్లు యూరియా ఉత్పత్తి నిలిపివేయాల్సి వచ్చింది. నిరంతరంగా ఉత్పత్తి జరిగి ఉంటే లాభం మరింత పెరిగే అవకాశముండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

EDITOR,PRINTER,PUBLISHER AND OWNED BY VONTELA KRISHNA, PRINTED AT M/S SAI VEERANJANEYA PRINTERS HNO.8-1-109,KATTARAMPUR,TOWN, MANDAL AND DIST KARIMNAGAR-505001.TELANGANA STATE.
PUBLISHED AT HNO.5-6-416/1,KAPUWADA,MARUTHINAGAR, KARIMNAGAR-505001.TELANGANA STATE. EDITOR: VONTELA KRISHNA.9849731222, EMAIL:KRISHNA.VONTELA@GMAIL.COM